RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్ దినపత్రిక

వరంగల్ | ఆదివారం | పేజీలు : 6
సంపుటి : 4, సంచిక : 42 | జనవరి 18, 2026 | వెల : రూ.3-00



ప్రజా పాలనకు ప్రతీక గృహజ్యోతి

4లో..

# 'పుర' పోరు!

## నగర పీఠాలపై ఇక రాజకీయ యుద్ధం వ్యూహప్రతివ్యూహాల్లో ప్రధాన పార్టీలు


- మేయర్లు, చైర్ పర్సన్ల రిజర్వేషన్లు ఖరారవడంతో పెరిగిన జోష్
- గెలుపు గుర్రాల కోసం పార్టీల అంతర్గత సర్వేలు
- టికెట్ల కోసం ఆశావహుల పైరవీలు షురూ
- మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు
- ఢీ అంటే ఢీ అంటున్న కాంగ్రెస్, బీఆర్ఎస్
- కమల వికాసం కోసం బీజేపీ ప్రయత్నాలు

3లో.



**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో:**

తెలంగాణలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. గ్రామీణ ప్రాంతాల్లో సర్పంచ్ ఎన్నికల హడావుడి ఇంకా తగ్గకముందే, పట్టణాల్లో మున్సిపల్ నగారా మోగేందుకు ముహూర్తం సిద్ధమైంది. వచ్చే వారం రోజులలోపే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుండటంతో, ప్రధాన పార్టీలన్నీ పోరాటానికి సిద్ధమవుతున్నాయి. రాష్ట్రంలోని 10 నగర పాలక సంస్థలు, 121 మున్సిపాలిటీలకు సంబంధించిన మేయర్, చైర్మన్ రిజర్వేషన్లను ప్రభుత్వం అధికారికంగా ఖరారు చేయడంతో.. ఏ స్థానం ఎవరికి దక్కుతుందనే ఉత్కంఠకు తెరపడింది. అధికార కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ ఎన్నికల జోష్‌ను పట్టణాల్లోనూ కొనసాగించి క్లీన్ స్వీప్ చేయాలని చూస్తుంటే.. బీఆర్ఎస్ ఈ ఎన్నికలను తమ రాజకీయ పునరుద్ధరణకు ఒక అస్త్రంగా మలచుకోవాలని భావిస్తోంది. మరోవైపు, పట్టణ ఓటర్లపై ఎంతో నమ్మకంతో ఉన్న బీజేపీ ప్రభావం చూపేందు కు పక్కా స్కెచ్ వేస్తోంది. మేయర్, చైర్మన్ పీఠాలపై కన్నేసిన ఆశావహులు మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు మొదలుపెట్టారు. అంగబలం, అర్థబలం ఉన్న గెలుపు గుర్రాలకే అన్ని పార్టీలు ఈసారి టికెట్లు ఇవ్వనున్నాయి. మరి ఈ 'పుర' పోరులో పట్టణ ఓటరు ఎవరి వైపు మొగ్గు చూపుతారో అన్నది ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తికరంగా మారింది.



వేద న్యూస్ తెలుగు దినపత్రిక -2026 క్యాలెండర్ ను శనివారం ఆవిష్కరిస్తున్న జమ్మికుంట ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి. రమేష్, వేద న్యూస్ సీనియర్ జర్నలిస్టు అంబీర్ శ్రీకాంత్



వేద న్యూస్ తెలుగు దినపత్రిక క్యాలెండర్-2026ను శనివారం ఆవిష్కరిస్తున్న వరంగల్ వాయిస్ తెలుగు దినపత్రిక ఎడిటర్ గద్దం కేశవమూర్తి

హనుమకొండ రెడ్డి కాలనీలో "వేద న్యూస్ తెలుగు దినపత్రిక" క్యాలెండర్ - 2026ను ఆవిష్కరిస్తున్న మాజీ సీనియర్ డెస్క్ జర్నలిస్ట్, ప్రస్తుత ప్రభుత్వ ఉపాధ్యాయుడు కూనమల్ల రాజన్‌బాబు



# సీఎంకు వినితి పత్రం అందజేత



**వేద న్యూస్, ఆదిలాబాద్ ప్రతినిధి :**

ఆదిలాబాద్ జిల్లా మున్నూరు కాపు బాలబాలికల హాస్టళ్ల నిర్మాణానికి 2.00 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయింపునకు సంబంధించిన పెండింగ్ అంశాన్ని వెంటనే పరిష్కరించాలంటూ, ఏఐసీసీ విచార్విభాగం తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. రెవెన్యూ (ల్యాండ్అడ్మినిస్ట్రేషన్-×) శాఖ మెమో నం.6712/LandAdmin.×(1)/2024-1, తేది 06-04-2024ప్రకారం ఈ ప్రతిపాదన ఇప్పటికే ప్రభుత్వ పరిశీలనలోఉంది. Rc.No.E1/1194/2024, తేది17-11-2024 ద్వారా మావల మండలంబట్టిసావర్గావ్ గ్రామం, సర్వే నం.72లో 2.00 ఎకరాలప్రభుత్వ భూమిని గుర్తించిన జిల్లా కలెక్టర్ నివేదికతోపాటు లోకేషన్ స్కెచ్ను ప్రభుత్వానికి సమర్పించినట్లు తుల అరుణ్ వివరించారు. ప్రక్రియ పూర్తి..అన్ని స్థాయిల్లో అధికారిక ప్రక్రియలు పూర్తయినప్పటికీ, ప్రస్తుతం ఈ అంశం రాష్ట్ర కేబినెట్ ఆమోదం దశలోపెండింగ్లో ఉండటంతో, వెనుకబడిన వర్గాలకు చెందినవిద్యార్థులు నష్టపోతున్నారని తెలిపారు. మున్నూరు కాపుబాలబాలికల హాస్టళ్ల నిర్మాణం వల్ల ఆదిలాబాద్ జిల్లాలోనిపేద విద్యార్థులకు మెరుగైన విద్యావకాశాలు లభిస్తాయని,ఇది సామాజిక అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. వినతిపత్రం తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

# కొడంగల్‌లో కాంగ్రెస్‌కు షాక్

- బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు
- కేటీఆర్ సమక్షంలో పార్టీలోకి నాయకులు, కార్యకర్తలు
- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో చేరికలు

3లో..

# సంగారెడ్డిలో ఇక పోటీ చేయను!

- రాహుల్ గాంధీ ప్రచారం చేసినా ఓడించారు
- నా ఓటమికి కారణం పేద ప్రజలు కాదు.. ఇక్కడి మేధావులే
- ఇక్కడ ఇక ప్రచారం చేయను
- కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి హాట్ కామెంట్స్



**వేద న్యూస్, సంగారెడ్డి:**

సంగారెడ్డిలో ఇకపై తాను ఎమ్మెల్యేగా పోటీ చేయనని కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తన రాజకీయ జీవితంలో సంగారెడ్డి అంశం మరిచిపోలేని అనుభవంగా మిగిలిపోయిందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. తన కోసం రాహుల్ గాంధీ స్వయంగా సంగారెడ్డికి వచ్చి ప్రచారం చేసినప్పటికీ తనను అక్కడి ప్రజలు ఓడించారని ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ భుజంపై చేయి వేసి తనను గెలిపించాలని కోరినా ఫలితం రాలేదని చెప్పారు. రాహుల్ గాంధీని సంగారెడ్డికి పిలిచి అవమానించినట్టే అయ్యానేమోనని కూడా తాను ఫీల్ అయ్యానని తెలిపారు. తన ఓటమికి కారణం పేద ప్రజలు కాదని, ఇక్కడి మేధావులు, పెద్దలే కారణమని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. ఈ ఓటమి తన జీవితంలో ఎప్పటికీ మరిచిపోలేనిదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో సంగారెడ్డిలో తన భార్య నిర్మలా పోటీ చేసినా తాను ప్రచారానికి రానని జగ్గారెడ్డి తేల్చి చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడికైనా వెళ్లి ప్రచారం చేస్తానని, కానీ సంగారెడ్డిలో మాత్రం ఇకపై ప్రచారం చేయనని ఆయన స్పష్టం చేశారు.

# కేంద్ర మంత్రికి వినతి


**వేద న్యూస్, ఇల్లందకుంట:**



ఇల్లందకుంట మండల పరిధి లోని కనగర్తి గ్రామానికి సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరు చేయాలని కోరుతూ.. గ్రామానికి చెందిన అన్ని పార్టీల నాయకులు కలిసి కరీంనగర్‌లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రినీ శనివారం కలిశారు. కనగర్తి గ్రామంలో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించి.. గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రాన్ని మంత్రికి అందజేశారు. కనగర్తి గ్రామ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని బండి సంజయ్ హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కనగర్తి గ్రామానికి చెందిన అన్ని పార్టీల నాయకులు మట్ట పవన్ రెడ్డి,మట్ట గోపాల్ రెడ్డి,రాజిరెడ్డి, రామిడి రాజు తదితరులు పాల్గొన్నారు.

# అవకాశం ఇవ్వండి..

# ప్లీజ్!



- ☐ టికెట్ల కోసం ఆశావహుల ప్రదక్షిణలు
- ☐ పార్టీ పెద్దల చుట్టూ తిరుగుతూ వేడుకోలు
- ☐ పురపోరుకు ప్రధాన పార్టీల సమాయత్తం
- ☐ అన్ని మున్సిపాలిటీల్లో జెండా పాతేలా కాంగ్రెస్ కసరత్తు
- ☐ వ్యూహాలు రచిస్తున్న బీఆర్ఎస్
- ☐ సత్తా చాటేందుకు బీజేపీ ప్రయత్నం

**వేద న్యూస్, సంగారెడ్డి:**

రానున్న పురపాలక ఎన్నికలకు ప్రధాన రాజకీయ పార్టీలు సమాయత్తమవుతున్నాయి. ఇప్పటికే ప్రభుత్వం పురపాలికల్లో సామాజిక వర్గాల వారీగా వార్డుల సంఖ్యను ప్రకటించగా, శనివారం సాయంత్రం నాటికి వార్డుల వారీ రిజర్వేషన్లను ప్రకటించేందుకు అధికార వర్గాలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి మెదక్ జిల్లాలోని 19 మున్సిపాలిటీల్లో కౌన్సిలర్ పదవులకు పోటీ చేయాలని ఆశిస్తున్న ఆశావహులు తమ తమ పార్టీల నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ టికెట్ దక్కేలా చూడాలని వేడుకుంటున్నారు.

**హస్తంలో 'ఆరుగురు'తో జాబితాలు**

అధికార కాంగ్రెస్ పార్టీ ఒక్కో వార్డు నుంచి అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న ఆరుగురితో జాబితాలు రూపొందించాలని నిర్ణయించింది. ఎమ్మెల్యేలతో పాటు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిలకు ఈ బాధ్యతలను అప్పగించింది. రిజర్వేషన్లు ఖరారు కాగానే దరఖాస్తులు స్వీకరించి బలమైన ఆశావహులను గుర్తించి అధిష్ఠానానికి జాబితా పంపాలని పీసీసీ ఆదేశాలు జారీ చేసింది. అత్యధిక బల్దియాలను కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో వార్డుల వారీగా సర్వేలు నిర్వహిస్తున్నారు.

**బీఆర్ఎస్ ప్రత్యేక కసరత్తు**

నాలుగు రోజుల క్రితం ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ నేతలతో సమావేశం నిర్వహించిన మాజీ మంత్రి హరీశ్ రావు, అభ్యర్థుల ఎంపిక విధానంపై ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాలకు చెందిన నేతలతో పాటు ముఖ్యనేతలకు పట్టణాల బాధ్యతలను అప్పగించారు. సర్వేల ఆధారంగా ప్రజల్లో పలుకుబడి ఉన్న నేతలకే టికెట్లు ఇవ్వాలని నిర్ణయించారు. పార్టీ ఆధిపత్యాన్ని నిలబెట్టేలా ప్రచారంతో పాటు అభ్యర్థుల ఎంపిక జరగాలని సూచించారు.

**సత్తా చాటేలా బీజేపీ వ్యూహాలు**

పట్టణ ప్రాంతాలపై దృష్టి సారించిన భారతీయ జనతా పార్టీ ఉమ్మడి జిల్లాలోని అన్ని పురపాలికల వార్డుల్లో పోటీ చేయాలని నిర్ణయించింది. దుబ్బాక, ఇస్నాపూర్, ఇంద్రేశం, సంగారెడ్డి, గజ్వేల్, మెదక్, రామాయంపేట తదితర పురపాలికల్లో గెలుపొందే అవకాశాలున్న స్థానాల్లో బలమైన అభ్యర్థులను బరిలోకి దింపేందుకు మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రైవేటు ఏజెన్సీలతో సర్వేలు నిర్వహించి, వాటి ప్రాతిపదికగానే అభ్యర్థులను ఎంపిక చేయాలని నిర్ణయించారు.

## వేద న్యూస్ క్యాలెండర్ ఆవిష్కరణ



**వేద న్యూస్, మరిపెడ:**

మహబూబాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు వేద న్యూస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని గెస్ట్ హౌస్లో నవీన్ రావు.. వేద న్యూస్ విలేకరి బాసిపంగు వెంకన్నతో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఓడీసీఎంఎస్ చైర్మన్ కుడితి మహేందర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మరిపెడ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఉప్పల నాగేశ్వరరావు, జాటోత్ బాలాజీ నాయక్, దిగజర్ల శ్రీనివాస్, ఆర్ఎంపీ డాక్టర్ మంద వెంకన్న, గంట్ల మహిపాల్ రెడ్డి, రూప్ల నాయక్, గందసిరి కృష్ణ, ప్రభాకర్ రెడ్డి, తుమ్మ సత్యం, శ్రీనివాస్ రెడ్డి, రమణ రెడ్డితో పాటు టీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం

**వేద న్యూస్, రుద్రూర్:**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా చేపట్టిన 'అరైవ్-అలైవ్' కార్యక్రమంలో భాగంగా శనివారం రుద్రూర్ మండల కేంద్రంలోని కామధేను రైస్ మిల్లులో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్, ఆర్టీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించి తమ ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రమాద సమయంలో హెల్మెట్ ప్రాణ రక్షణకు కవచంలా పనిచేస్తుందని తెలిపారు. అజాగ్రత్తగా వాహనాలు నడపరాదని, మద్యం సేవించి వాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. అలాగే అతివేగం రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ కృష్ణ, ఎస్సై సాయన్న, బచ్చు రామ్ సెట్, పోలీసు సిబ్బంది, హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా రద్దు చేస్తే ఆమరణ దీక్ష

- కాంగ్రెస్‌కు సిరిసిల్లలో 100 గజాల గోతే
- జిల్లా అయ్యాకే అన్నివిధాలా అభివృద్ధి
- ఉద్యమకారుడు రంజిత్



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లాను రద్దు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని జిల్లా ఉద్యమకారుడు మారవేణి రంజిత్ కుమార్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. శనివారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఏర్పాటు అయిన తరువాతే సిరిసిల్ల అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, ఇప్పుడు జిల్లాను రద్దు చేయడం అంటే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి నుంచి వెనక్కి నెట్టడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా జిల్లా రద్దు నిర్ణయం తీసుకుంటే తీవ్ర ప్రజా ఉద్యమం తప్పదని స్పష్టం చేశారు. జిల్లా రద్దు చేస్తే సిరిసిల్ల నడిబొడ్డున కాంగ్రెస్ పార్టీకి 100 గజాల గోతిని తవ్వి పాతేస్తామని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సిరిసిల్ల ప్రజల సహనాన్ని పరీక్షించవద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి జిల్లా ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. జిల్లా రద్దు జరిగితే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు రోడ్లపై తిరగలేని పరిస్థితి ఏర్పడుతుందని, ఇది ఉద్యమాల గడ్డ సిరిసిల్ల అని గుర్తు చేశారు.

**త్యాగాలకు సిద్ధం.. ఉద్యమమే ఊపిరి**

గతంలో షాడో సీఎం మెడలు వంచి జిల్లా సాధించుకున్న చరిత్ర ఉందని రంజిత్ కుమార్ గుర్తు చేశారు. జిల్లాకోసం ఎందరో ఉద్యమకారులు కేసులు ఎదుర్కొని జైలు జీవితం గడిపారని, జిల్లా అస్తిత్వం కోసం మళ్లీ జైలుకు వెళ్లడానికైనా, అవసరమైతే ప్రాణత్యాగానికైనా సిద్ధమేనని స్పష్టం చేశారు. గతంలో జిల్లా ఏర్పాటుకు మద్దతు తెలిపిన ప్రస్తుత ముఖ్యమంత్రి ఇప్పుడు దానిని రద్దు చేయాలని ప్రయత్నించడం శోచనీయమని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే జిల్లా రద్దు ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యమకారులు సమానపల్లి ప్రశాంత్, అక్కేమ్ నాగరాజు, గొండ్లే తిరుపతి, టేకు మధు, హనుమాన్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని ధర్నా

**వేద న్యూస్, దామరచర్ల:**



తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులు శనివారం దామరచర్ల ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ దయానంద్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే డ్రెస్ కోడ్ అమలు చేయడంతో పాటు కనీస వేతనం ఇవ్వాలని కోరారు. కొత్తగా ఎన్నికైన గ్రామ పంచాయతీ సర్పంచులు కార్మికులపై దయ చూపి, వారు చేస్తున్న పనికి తగిన విధంగా కనీస వేతనం, ఆరోగ్య బీమా సహా అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ధర్నా అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపిడిఓ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల గ్రామ పంచాయతీ వర్కర్స్ అధ్యక్షుడు శ్రీరాములు, ఉపాధ్యక్షుడు ఏ. సైదులు, ప్రధాన కార్యదర్శి ఎం.డి. జైరు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కప్ తో క్రీడాకారులకు ప్రోత్సాహం

- గ్రామస్థాయి నుంచి ప్రతిభావంతులను వెలికి తీసే లక్ష్యం
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- సీఎం కప్ పోటీలు ప్రారంభం
- హాజరైన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**




ఒలింపిక్స్‌లో దేశానికి ఎక్కువ సంఖ్యలో పతకాలు సాధించాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తోందని, సీఎం కప్ ద్వారా రాష్ట్రంలోని గ్రామ స్థాయి నుంచే ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికి తీసి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సాహం అందిస్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చెప్పారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో శనివారం సీఎం కప్ టార్చ్ ర్యాలీని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే కలిసి ప్రారంభించారు. అంబేద్కర్ చౌక్ నుంచి నేతన్న విగ్రహం వరకు విప్, ఇంచార్జి కలెక్టర్, ఎస్పీ, అధికారులు, క్రీడాకారులు, విద్యార్థులతో కలిసి టార్చ్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ క్రీడా విభాగాల్లో రాష్ట్రంలోని అన్ని గ్రామాల నుంచి షెడ్యూల్ ప్రకారం పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని సౌకర్యాలు, శిక్షణ ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు యువత, విద్యార్థులకు ఉత్తమ శిక్షణ, ఉపాధి అందించే అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సీఎం కప్ పోటీలను నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరికి కృతజ్ఞతలు తెలిపారు.

**ఎక్కువ పతకాలు సాధించాలి..**

సీఎం కప్ పోటీల ప్రారంభోత్సవం సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లాలోని విద్యార్థులు, యువత సీఎం కప్ పోటీల్లో పాల్గొని ఎక్కువ సంఖ్యలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు, యువత మొబైల్ ఫోన్ల వినియోగాన్ని తగ్గించి క్రీడలు, మైదానాల్లో ఎక్కువ సమయం గడపాలని సూచించారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దారుఢ్యం, పాజిటివ్ ఎనర్జీ పెరుగుతుందని తెలిపారు. సీఎం కప్ టార్చ్ ర్యాలీ సిరిసిల్లలో ప్రారంభమై జిల్లాలోని అన్ని మండలాల్లో సాయంత్రం వరకు కొనసాగుతుందని తెలిపారు. జిల్లా నుంచి విద్యార్థులు, యువత క్రీడల్లో రాణించేలా జిల్లా క్రీడల, విద్యా శాఖల ఆధ్వర్యంలో శిక్షణ అందిస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ షెడ్యూల్ ప్రకారం జిల్లాలో మొత్తం 34 క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయికి క్రీడాకారులను పంపిస్తామని పేర్కొన్నారు. వచ్చే నెలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి అన్ని క్రీడా విభాగాల్లో జట్లను పంపిస్తామని తెలిపారు. క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.


**ఇదీ షెడ్యూల్..**

గ్రామపంచాయతీ స్థాయిలో ఈ నెల 17 నుంచి 22వ తేదీ వరకు, మండల/మున్సిపాలిటీ జోనల్ స్థాయిలో ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు, జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఫిబ్రవరి 3 నుంచి 5వ తేదీ వరకు, జిల్లా స్థాయిలో ఫిబ్రవరి 9 నుంచి 12వ తేదీ వరకు, రాష్ట్ర స్థాయిలో ఫిబ్రవరి 20 నుంచి 23వ తేదీ వరకు సీఎం కప్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూప రెడ్డి, యువజన క్రీడల శాఖ అధికారి రాందాస్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల వేళ బీజేపీకి భారీ షాక్

- కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ వేములవాడ పట్టణ ప్రధాన కార్యదర్శి

**వేద న్యూస్, వేములవాడ:**



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి, రాజన్న యూత్ అధ్యక్షుడు బోనాల శివ తన పదవికి, పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 150 మంది అనుచరులతో కలిసి బోనాల శివ కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బోనాల శివ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ రాజ్యంలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని అన్నారు. అలాగే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సారథ్యంలో వేములవాడ పట్టణం అన్ని రంగాల్లో అద్భుతమైన అభివృద్ధి సాధిస్తోందని కొనియాడారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులమై, వేములవాడ పురోగతిలో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతోనే తాము కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఆయన తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు ముందు కీలక నేత పార్టీని వీడటం బీజేపీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది.

# 'పుర' పోరు!

## నగర పీఠాలపై ఇక రాజకీయ యుద్ధం
## వ్యూహప్రతివ్యూహాల్లో ప్రధాన పార్టీలు

- మేయర్లు, చైర్ పర్సన్ల రిజర్వేషన్లు ఖరారవడంతో పెరిగిన జోష్
- గెలుపు గుర్రాల కోసం పార్టీల అంతర్గత సర్వేలు
- టికెట్ల కోసం ఆశావహుల పైరవీలు షురూ
- మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు
- ఢీ అంటే ఢీ అంటున్న కాంగ్రెస్, బీఆర్ఎస్
- కమల వికాసం కోసం బీజేపీ ప్రయత్నాలు



**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో:**

తెలంగాణలో పట్టణ పోరుకు కౌంట్‌డౌన్ మొదలైంది. వచ్చే వారం రోజులలోపే మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుండటంతో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఇప్పటికే రాష్ట్రంలోని 10 నగర పాలక సంస్థలు, 121 మున్సిపాలిటీలకు సంబంధించిన మేయర్, చైర్మన్ రిజర్వేషన్లను ప్రభుత్వం ఖరారు చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కోలాహలం మొదలైంది. ఏఏ స్థానం ఎవరికి దక్కుతుందో స్పష్టత రావడంతో, గెలుపు గుర్రాలను వేటాడే పనిలో పార్టీలు నిమగ్నమయ్యాయి. నోటిఫికేషన్ వచ్చిన 15 రోజుల్లోనే మొత్తం తంతు ముగించేలా అధికార యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తోంది. కాబట్టి ఫిబ్రవరిలోనే ఎన్నికలు నిర్వహించే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే సర్పంచ్ ఎన్నికల హడావుడి తగ్గని రాజకీయ పార్టీలకు మున్సిపల్ రిజర్వేషన్ల ప్రకటనతో మరింత జోష్ వచ్చింది.

**జోరుమీదున్న కాంగ్రెస్**

గెలుపు గుర్రాల కోసం కాంగ్రెస్ వెతుకులాట మొదలైంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన ఉత్సాహంలో ఉన్న కాంగ్రెస్, మున్సిపల్ ఎన్నికల్లోనూ అదే జోరును కొనసాగించాలని భావిస్తోంది. మున్సిపల్ పీఠాలను కైవసం చేసుకునేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేకంగా అంతర్గత సర్వేలు చేయిస్తోంది. కేవలం ప్రజాదరణ మాత్రమే కాకుండా, ఎన్నికల ఖర్చును భరించగలిగే ఆర్థిక బలవంతులకే టికెట్లు దక్కేలా వ్యూహాలు రచిస్తోంది. మంత్రులు, ఎమ్మెల్యేలు ఇప్పటికే తమ తమ నియోజకవర్గాల్లో పర్యటిస్తూ గెలుపు గుర్రాలను గుర్తించే పనిలో పడ్డారు.

**పట్టు కోసం బీఆర్ఎస్..**

ఇక మరోవైపు బీఆర్ఎస్ ఈ ఎన్నికలను తమ రాజకీయ పునరుద్ధరణకు కీలకంగా భావిస్తోంది. సర్పంచ్ ఎన్నికల కంటే మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పార్టీకి పట్టు ఎక్కువగా ఉందన్న నమ్మకంతో బీఆర్ఎస్ ముందుకు సాగుతోంది. గతంలో పట్టణ పాలనలో తమ అనుభవాన్ని ప్రజలకు గుర్తుచేస్తూ, అభివృద్ధి అంశాలను ప్రధాన అజెండాగా మార్చే ప్రయత్నాలు చేస్తోంది. ఈసారి వీలైనన్ని ఎక్కువ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను తమ ఖాతాలో వేసుకోవాలన్న లక్ష్యంతో పార్టీ ముఖ్య నేతలు ముందుగానే రంగం సిద్ధం చేశారు. స్థానిక నేతలతో వరుస సమావేశాలు, ఆశావహుల స్క్రీనింగ్, సామాజిక వర్గాల లెక్కలు అన్నీ సమాంతరంగా సాగుతున్నాయి. పట్టణ ఓటర్లు తమవైపే ఉన్నారని నిరూపించుకుని, పునర్వైభవం సాధించాలని కేసీఆర్ సహా ముఖ్య నేతలు క్షేత్రస్థాయి క్యాడర్‌ను సమాయత్తం చేస్తున్నారు.

**కమలం వికసించేనా?**

కమల వికాసం కోసం బీజేపీ ప్లాన్ చేస్తోంది. పట్టణాల్లో ఉన్న మధ్యతరగతి, యువత ఓటర్లపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ వ్యూహాలు రచిస్తోంది. కేంద్ర ప్రభుత్వ పథకాలు, జాతీయ రాజకీయాల ప్రభావాన్ని పట్టణ ఓటర్లకు అనుసంధానించాలన్న ప్రయత్నాలు బీజేపీ చేస్తోంది. కొన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో గట్టి పోటీ ఇవ్వాలన్న సంకల్పంతో పార్టీ అడుగులు వేస్తోంది. హైదరాబాద్ శివారు మున్సిపాలిటీలతో పాటు ఉత్తర తెలంగాణ కార్పొరేషన్లపై బీజేపీ కన్నేసింది. ప్రధానంగా పట్టణ ఓటర్లను ఆకర్షించి తమ బలాన్ని పెంచుకోవాలని కమలనాథులు సిద్ధమవుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల జోరును ఇక్కడ చూపిస్తామని ఆ పార్టీ ధీమా వ్యక్తం చేస్తోంది.

**మేయర్ రిజర్వేషన్ల లెక్కలివే..**

ఇదిలా ఉండగా, రాష్ట్రంలోని పది మున్సిపల్ కార్పొరేషన్లకు మేయర్ రిజర్వేషన్లు ఖరారవ్వడం రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చేసింది. ఎస్టీ, ఎస్సీ రిజర్వేషన్ల కంటే ఈసారి బీసీ మరియు మహిళా కోటా స్థానాల్లో పోటీ తీవ్రంగా ఉండేలా కనిపిస్తోంది. కొత్తగూడెం ఎస్టీ జనరల్, రామగుండం ఎస్సీ జనరల్‌గా ఉండగా, మహబూబ్నగర్ మహిళా బీసీకి కేటాయించారు. మంచిర్యాల, కరీంనగర్ బీసీ జనరల్‌గా, గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ మహిళా జనరల్‌గా ఖరారైంది. గ్రేటర్ వరంగల్ జనరల్‌గా ఉండగా, ఖమ్మం, నల్లగొండ, నిజామాబాద్ మహిళా జనరల్‌గా నిర్ణయించారు. ఈ రిజర్వేషన్లతో ఇప్పటికే ఆశావహుల జాబితాలు పూర్తిగా మారిపోయాయి.

**మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు**

మున్సిపల్ చైర్మన్, మేయర్ పదవుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కేటాయించడం ఈ ఎన్నికల ప్రత్యేకత. 121 మున్సిపాలిటీల్లో 61 స్థానాలు జనరల్‌కు దక్కగా, బీసీలకు 38, ఎస్సీలకు 17, ఎస్టీలకు 5 కేటాయించారు. దీనివల్ల చాలా చోట్ల ప్రధాన నాయకులు తమ భార్యలను లేదా మహిళా బంధువులను బరిలోకి దింపేందుకు సిద్ధమవుతున్నారు.

**ఆశావహుల ప్రదక్షిణలు**

రిజర్వేషన్ల ప్రకటనతో పట్టణాల్లో ఎన్నికల వేడి పెరిగింది. దీంతో పార్టీల కార్యాలయాలు ఆశావహులతో కిటకిటలాడుతున్నాయి. టికెట్ల కోసం ఆశావహులంతా మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా ఇన్చార్జుల ఇళ్ల ముందు క్యూ కడుతున్నారు. తమకు టికెట్ ఇస్తే గెలిచి తీరుతామని హామీలు ఇస్తూ ఎవరి ప్రయత్నాలు వారివే అన్నట్టుగా లాబీయింగ్ చేస్తున్నారు. కొందరు తమ సామాజిక వర్గ బలాన్ని చూపుతుంటే, మరికొందరు తమ సేవా కార్యక్రమాల ద్వారా పార్టీ అధిష్టానం దృష్టిని ఆకర్షిస్తున్నారు. కాగా, ఈసారి టికెట్ల పంపిణీ పార్టీలకు పెద్ద సవాలుగా మారనుందన్న అంచనాలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి.

**బీఆర్ఎస్, కాంగ్రెస్ సై అంటే సై**

ప్రస్తుత నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మున్సిపల్ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. సర్పంచ్ ఎన్నికలతో గ్రామస్థాయిలో వచ్చిన జోష్‌ను రెండు పార్టీలు పట్టణ రాజకీయాల్లోనూ కొనసాగించాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నాయి. గ్రామాల నుంచి పట్టణాలకు వలస వచ్చిన ఓటర్లు, స్థానిక సమస్యలపై అసంతృప్తిని తమకు అనుకూలంగా మలచుకోవాలన్న ప్రయత్నాలు చేస్తున్నాయి. అందులో భాగంగానే పార్టీలు అంతర్గతంగా విస్తృత సర్వేలు చేపిస్తున్నాయి. ఏ ప్రాంతంలో ఎవరికెంత బలం ఉంది, సామాజిక సమీ కరణాలు ఎలా ఉన్నాయి, గత ఎన్నికల ఫలితాలు ఏమి చెబుతున్నాయి అన్న అంశాలపై లోతైన విశ్లేషణ జరుగుతోంది. ఈసారి భావోద్వేగాలకన్నా గెలుపు సాధించే అవకాశాలున్న అభ్యర్థులకే టికెట్లు ఇవ్వాలన్న ఆలోచనలో రెండు పార్టీలు బలంగా వినిపిస్తున్నాయి. ఆర్థి కంగా బలంగా ఉండి, ప్రచార ఖర్చులు భరించగలిగే అభ్యర్థులకే ప్రాధాన్యం దక్కే పరిస్థితి కనిపిస్తోంది.

---

## కొడంగల్‌లో కాంగ్రెస్‌కు షాక్



**వేద న్యూస్ కొడంగల్ :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలోకి చేరారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో, కొడంగల్ మాజీ శాసన సభ్యులు పట్నం నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కొత్తపల్లి మండలం నుంచి సుమారు 150 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలోకి చేరిన వారికి కేటీఆర్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ విధానాలు, నాయకత్వం పట్ల విశ్వాసంతోనే ప్రజలు పార్టీలోకి వస్తున్నారని పేర్కొన్నారు. కొడంగల్‌లో బీఆర్ఎస్ బలపడుతుండటం, కాంగ్రెస్ నుంచి వరుసగా చేరికలు జరుగుతుండటంతో రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీసింది. రానున్న రోజుల్లో మరిన్ని చేరికలు ఉంటాయని పార్టీ నేతలు తెలిపారు.

## ఇన్‌స్టాగ్రామ్‌లో బాలికకు వేధింపులు

- మైనర్ బాలుడిపై పోక్సో కేసు నమోదు




**వేద న్యూస్, చందుర్తి:**

సోషల్ మీడియా వేదికగా మైనర్ బాలికను వేధించిన ఘటనలో మైనర్ బాలుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జె. రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. చందుర్తికి చెందిన ఓ మైనర్ బాలుడు తన ఇన్‌స్టాగ్రామ్ ఐడీ ద్వారా అదే ప్రాంతానికి చెందిన మైనర్ బాలికకు అసభ్యకరమైన సందేశాలు పంపుతూ వేధింపులకు పాల్పడ్డాడు. తనను ప్రేమించాలని, లేదంటే ఆమె గురించి తల్లిదండ్రులకు అసభ్యకరంగా చెబుతానని బెదిరించినట్లు తెలిపారు. ఈ విషయమై బాలిక తల్లి ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. సోషల్ మీడియా ద్వారా బాలికలను వేధించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, వేధింపులకు గురైన వారు లేదా వారి కుటుంబ సభ్యులు తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

## నిరుపేద బాధితులకు భరోసా సీఎంఆర్ఎఫ్

- మందమర్రి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉపేందర్ గౌడ్



**వేద న్యూస్, మందమర్రి:**

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలను అనారోగ్య సమయంలో ఆదుకునే భరోసాగా నిలుస్తుందని మందమర్రి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్ అన్నారు. మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా నోముల ఉపేందర్ గౌడ్ మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు సీఎం సహాయ నిధి ఎంతో ఉపయుక్తంగా మారిందని తెలిపారు. ప్రభుత్వం పేదల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సోతుకు సుదర్శన్, గుడ్ల రమేష్, పైడిమల్ల నర్సం గౌడ్, మాయ తిరుపతి, ఎర్ర రాజు, ముదారపు శేఖర్, కొలిపాక సదానందం, ఎండీ జావీద్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుకు అండగా ఎన్ హెచ్ఆర్సీ..!

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

సత్యాన్ని నిగ్గుతేల్చే నిక్కార్సైన జర్నలిజం నేడు అనేక ఒత్తిళ్లు, బెదిరింపులు, తప్పుడు కేసుల మధ్య నిలబడుతున్న పరిస్థితుల్లో జర్నలిస్టులకు ఒక కీలకమైన న్యాయ విజయంగా ఈ ఘటన నిలుస్తోంది. ప్రజల కోసం నిజాలు వెలికి తీయాలనే ప్రయత్నంలో తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి పనిచేస్తున్న జర్నలిస్టులు, నీతి--నిజాయితీ తప్పిన కొంతమంది ఖాకీ అధికారుల అక్రమ చర్యల వల్ల తీవ్ర మానసిక, వృత్తి పరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాస్తవాన్ని జర్నలిస్టు ఆకుల సుధాకర్ జాతీయ హ్యూమన్ రైట్స్ మానవ హక్కుల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. జర్నలిస్టులపై జరుగుతున్న అక్రమ వేధింపులపై ఫిర్యాదును స్వీకరించిన మానవ హక్కుల సంఘం, ఈ వ్యవహారాన్ని అత్యంత గంభీరంగా పరిగణించింది. వెంటనే సమగ్ర విచారణ జరపాలని వరంగల్ పోలీస్ కమిషనర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీంతో సంబంధిత అధికారుల చర్యలపై విచారణ తప్పనిసరిగా జరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో నల్లబెల్లి ఎస్సై వ్యవహారంపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటారా, లేక తప్పు చేసిన ఖాకీని కాపాడే ప్రయత్నం జరుగుతుందా అన్న అంశంపై ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది. వరంగల్ కమిషనర్ ఈ విషయంలో ఏ నిర్ణయం తీసుకుంటారన్నది ఇప్పుడు ప్రజాస్వామ్య వాదుల దృష్టిని ఆకర్షిస్తోంది. కాగా ఈ ఘటనపై అఖిల భారతీయ జర్నలిస్ట్ ప్రొటెక్షన్ ఫోర్స్ చైర్మన్ చుంచు కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. జర్నలిస్టులపై ఇష్టానుసారంగా తప్పుడు కేసులు పెట్టి, బెదిరింపులకు గురి చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని ఆయన స్పష్టంచే ఉశారు. ప్రజల కోసం నిజాలను నికా,ర్సుగా అక్షర యోధుల పై దాడులు చేస్తే ఎంతటి అధికారులైనా వదిలి పెట్టబోమని హెచ్చరించారు. ఈ కేసులో వెంటనే సమగ్ర విచారణ జరిపి, తప్పు చేసిన ఎస్సైపై కఠినమైన శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే విషయంపై స్పందించిన జాతీయ మానవ హక్కుల కమిషన్ డైరెక్టర్, జర్నలిస్టులపై అక్రమ కేసులు, దౌర్జన్యాలు, బెదిరింపులు



కొనసాగితే మానవ హక్కుల సంఘం కఠినంగా స్పందిస్తుందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ విషయంలో రాజీ పడే ప్రశ్నే లేదని, అవసరమైతే చట్టపరమైన చర్యలకు వెనుకాడబోమని ఆయన స్పష్టంగా ప్రకటించారు. ఇకపై జర్నలిస్టులకు ఎలాంటి అన్యాయం జరిగినా అఖిల భారతీయ జర్నలిస్ట్ ప్రొటెక్షన్ ఫోర్స్ చైర్మన్ ముందుండి పోరాటం చేస్తుందని, అక్షర స్వేచ్ఛను కాపాడేందుకు ముందు వరుసలో నిలబడుతుందని చుంచు కుమార్ భరోసా ఇచ్చారు. ఈ పరిణామం జర్నలిస్టులకు ధైర్యం నింపే సంకేతంగా మారిందని, ఖాకీ దౌర్జన్యానికి చెక్ పడే దిశగా ఇది ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ఘనంగా ఏడవ వార్షిక క్రీడా దినోత్సవ వేడుకలు

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

ది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో 7వ, వార్షిక క్రీడా దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ముందుగా విద్యార్థుల చేత వివిధ రకాల క్రీడా విన్యాసాలతో పాటు క్రీడా జ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహించారు.గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ గ్రేటర్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ తల్లిదండ్రులందరూ విద్యా విషయాలకే కాకుండా క్రీడలను కూడా అంతే స్థాయిలో ప్రోత్సహించాలన్నారు. చదువు, కెరీర్‌తో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలనీ అదే విధంగా ఇటీవల భారత మహిళా క్రికెట్ జట్టు వరల్డ్ కప్ గెలుపొందిన మ్యాచ్‌ను చూస్తున్నపుడు నేను గమనించిన విషయం ఏమనగా మన దేశ చరిత్రలో ఇంతవరకు మహిళల క్రికెట్‌కు ఇంతటి స్పందన రావడం ఎప్పుడూ చూడలేదు ఆ రోజు నిజంగా గర్వించదగ్గ రోజు అని పురుషుల ఆధిపత్యంగా భావించే క్రీడలో మహిళలు ముందుకు వచ్చి తమ సత్తాను చాటుకుని, దేశానికి గర్వకారణంగా నిలిచారనీ కొనియాడారు. మానసిక ఆరోగ్యానికి ఆటలు ఎంతో దోహదము చేస్తాయని, విద్యార్థి దశ నుండి విద్యతో పాటు క్రీడలలో కూడా పాల్గొని అన్ని రంగాలలో రాణించాలని అన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ ఎల్.సరిత రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో చేపట్టిన ప్రణాళికలు, వాటి ప్రగతి, అమలు చేస్తున్న విధానాలు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలలో పాల్గొని గెలుపొందిన విద్యార్థులను




అభినందించారు. అలాగే హెచ్.పి. ఎస్. సొసైటీ కి చెందిన కార్య వర్గ సభ్యులు అపనేందర్ బాబు , హేమంత్ జలాన్, రామంతాపూర్ ప్రిన్సిపాల్ నరసింహ రెడ్డి క్రీడలలో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్ అందజేశారు.ఈ విద్యా సంవత్సరమునకు (2025-26 ) క్రీడలలో రాణించిన నాగార్జున బృందము వారికి ఓవరాల్ ఛాంపియన్ షిప్ అవార్డును గెలుచుకున్నారు. రెండవ స్థానం నలంద హౌస్ నిలించింది. ఈ కార్యక్రమంలో నాగార్జున హౌస్ మాస్టర్ చంద్రమౌళి, తక్షశిల హౌస్ మాస్టర్ రాజ్ కుమార్, నలంద హౌస్ మాస్టర్ సంతోష్, విజయనగర హౌస్ మాస్టర్ శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు మహ్మద్ ఆసిఫ్ ఇక్బాల్, రీయాజ్, విద్యార్థి నాయకులు వివేక్, వర్షిత, నిహారిక, శ్రేష్ఠ, హాన్స్ రాజ్, హర్ష గీతిక, ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు పాల్గొని విజయవంతం చేశారు.

వేద న్యూస్

ఆదివారం జనవరి 18, 2026

# హుజూరాబాద్ జిల్లా సాధనకు దీక్ష

– జిల్లా ఏర్పాటు చేయకపోతే అభివృద్ధి కుంటుపడే ప్రమాదం : రామంచ భరత్, బోయిని సమ్మయ్య

**వేద న్యూస్, జమ్మికుంట:**




హుజూరాబాద్‌ను కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ హుజూరాబాద్ జిల్లా సాధన కమిటీ ఆధ్వర్యంలో ఒకరోజు రిలే నిరాహారదీక్ష శనివారం నిర్వహించారు. ఈ నిరాహారదీక్షలో ద్రావిడ సాంస్కృతిక కళామండలి అధ్యక్షులు రామంచ భరత్, కోరపెల్లి మాజీ సర్పంచ్ బోయిని సమ్మయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.., 2016 నుండి హుజూరాబాద్ కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రజలు నిరంతరం ఉద్యమాలు చేస్తూ తమ ఆకాంక్షను వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. హుజూరాబాద్‌ను జిల్లా కేంద్రంగా ప్రకటించకపోతే ఈ ప్రాంత అభివృద్ధి పూర్తిగా స్తంభించిపోయే ప్రమాదం ఉందని, అన్ని వర్గాల ప్రజలకు జీవనోపాధి అవకాశాలు కరువయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్విభజనను శాస్త్రీయబద్ధంగా చేపడతామని ప్రకటించిన నేపథ్యంలో, ప్రస్తుతం ఉన్న హుజూరాబాద్, జమ్మికుంట, కమలాపూర్, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, హుస్నాబాద్, సైదాపూర్, శంకరపట్నం, వీణవంక, ఇల్లందకుంట, చిగురుమామిడి, అక్కన్నపేట మండలాలతో పాటు, కొత్తగా ఏర్పాటు చేయబోయే వావిలాల, చల్లూర్, చెల్పూర్, గొడిశాల, శనిగరం మండలాలను కలుపుకొని మొత్తం 17 మండలాలతో హుజూరాబాద్ జిల్లా ఏర్పాటు చేయడానికి అన్ని అర్హతలు కలిగి ఉందని వారు పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు హుజూరాబాద్ అంబేద్కర్ చౌరస్తా వద్ద ఒకరోజు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ జిల్లా సాధన జేఏసీ, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, డీటీఎఫ్ నాయకులు ఈశ్వర్ రెడ్డి, పీజీహెచ్ఎం వేల్పుల రత్నం, భీమోజు సదానందం, కన్వీనర్ పొడిచెట్టి వెంకటరాజం, ముక్కెర రాజ, తునికి సమ్మయ్య, వేల్పుల ప్రభాకర్, రామ్ రాజేశ్వర్, ఆర్టీసీ రవీందర్, పులి జగన్నాథం, మాజీ ఎంపీపీ వెంకటరాజం, ఉద్యోగ సంఘాలు, ప్రజా సంఘాలు, రిటైర్డ్ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అతివేగమే ప్రమాదాలకు కారణం

- యువతే ఎక్కువగా రోడ్డు ప్రమాదాల్లో బలవుతున్నారు
- మీ కోసం కాదు.. మీ కుటుంబం కోసం హెల్మెట్
- మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్

**వేద న్యూస్, మెదక్:**



ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించి, నిర్ణీత వేగ పరిమితుల్లో వాహనాలు నడపాలని, రోడ్డు భద్రత నియమాలు పాటించడం ద్వారానే ప్రమాదాల ను నివారించవచ్చని జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ తెలిపారు. మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ పరేడ్‌కు హాజరై గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పరేడ్‌ను పరిశీలించిన ఆయన, అధికారులు మరియు సిబ్బందికి విధి నిర్వహణలో క్రమశిక్షణ, సమయపాలన, శారీరక దృఢత్వం ఎంతో అవసరమని సూచించారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. 'అరైవ్–అలైవ్' రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా సిబ్బందిని ఉద్దేశించి అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల వివరాలను ఈ సందర్భంగా తెలియజేశారు. అధిక వేగం, అజాగ్రత్త వాహన నిర్వహణ కారణంగానే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో జరిగిన హత్యల కంటే కూడా రోడ్డు ప్రమాదాలలో మరణించిన వారి సంఖ్య ఎక్కువగా ఉందని గుర్తు చేశారు. రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారిలో యువత శాతం అధికంగా ఉండటం ఆందోళనకరమని పేర్కొంటూ, ప్రతి యువతకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సిబ్బంది ఇంటి నుంచి బయలుదేరి క్షేమంగా తిరిగి చేరే వరకు వారి కుటుంబ సభ్యులు ఎదురుచూస్తారని, అందువల్ల రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ జాగ్రత్తగా వాహనాలు నడిపి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. చివరగా జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ సిబ్బందితో కలిసి రోడ్డు భద్రత ప్రతిజ్ఞను పఠనం చేశారు. రోడ్డు నియమాలు పాటిస్తూ, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించకుండా, ఇతర రోడ్డు వినియోగదారులను గౌరవిస్తూ ప్రమాదాలు జరగకుండా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ రంగా నాయక్, సీఐలు జార్జ్, శ్రీ మహేష్, ఎస్ఐలు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కన్నుల పండుగగా వీరభద్ర స్వామి కల్యాణం

**వేద న్యూస్, శంకరపట్నం:**

శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలో ప్రతి ఏటా సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించే శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు ఈసారి కూడా ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణంతో పాటు అగ్నిగుండాల కార్యక్రమాన్ని శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సంక్రాంతి పండుగ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు గంగాధర స్వామి, ఆయన తనయుడు కన్నయ్య వేదమంత్రోచ్ఛారణల మధ్య ఆశేష భక్తజన సమక్షంలో స్వామివారి కళ్యాణాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. అనంతరం అగ్నిగుండాల కార్యక్రమం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. ఈ కార్యక్రమానికి గ్రామంతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు భారీగా హాజరై కళ్యాణం, అగ్నిగుండాలలో పాల్గొని తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పూజారి రాజు, మాజీ సర్పంచులు దండు సాయిలు, మోరే అనూష శ్రీనివాస్, నరహరి శారద బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీటీసీ వావిలాల రాజు, రాయిని లలిత దేవి శంకరయ్య, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పుల్లూరి వీరేశం, అభివృద్ధి కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, భక్తులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**వేద న్యూస్, శంకరపట్నం:**



శంకరపట్నం మండలం తాడికల్ గ్రామానికి చెందిన కిరాణా వ్యాపారి రాణవేణి హనుమయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను శనివారం మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, తమకు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మృతుని కుమారులు గణేష్, శ్రీనివాస్ ను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్, హుజురాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నాంపల్లి తిరుపతి, తాడికల్ సర్పంచ్ దుర్గం సుజాత, మెట్టుపల్లి ఉపసర్పంచ్ గొట్టే మధు, కీసర సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతలో హెల్మెట్ కీలక పాత్ర



- ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా ధరించాలి
- ప్రాణ రక్షణకు అత్యంత అవసరం
- మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు

**వేద న్యూస్, మెదక్:**

రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టాన్ని తగ్గించేందుకు హెల్మెట్ వినియోగం అత్యంత కీలకమని మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు అన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇది చట్టపరమైన నిబంధన మాత్రమే కాకుండా వ్యక్తిగత భద్రతకు ప్రధాన రక్షణ అని పేర్కొన్నారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వల్ల చిన్న ప్రమాదం కూడా తీవ్రమైన గాయాలు లేదా ప్రాణాంతక పరిణామాలకు దారితీస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రోజువారీగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల విశ్లేషణలో ఎక్కువగా తలకు గాయాల కారణంగానే ప్రాణనష్టం సంభవిస్తున్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయని చెప్పారు. సరైన నాణ్యత గల ఐఎస్ఐ మార్క్ ఉన్న హెల్మెట్ ధరించడం ద్వారా తలకు గాయాల తీవ్రతను గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు. వాహనం నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చునే వారు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందేనని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచేందుకు 'అరైవ్–అలైవ్' కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాలలు, గ్రామాలు, ప్రధాన రహదారులపై అవగాహన సదస్సులు, ఫ్లెక్సీలు, ర్యాలీల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నామని వివరించారు. ట్రాఫిక్ నియమాలు పాటించని, హెల్మెట్ ధరించని వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ చర్యలు శిక్ష కోసం కాకుండా ప్రజల ప్రాణ రక్షణ కోసమేనని స్పష్టం చేస్తూ, ప్రతి పౌరుడు బాధ్యతతో వ్యవహరించి హెల్మెట్‌ను అలవాటుగా మార్చుకొని సురక్షితంగా ప్రయాణించాలని జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# శ్రీ రామలింగేశ్వరస్వామి రథోత్సవం

– పాల్గొన్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం జంగారెడ్డిపల్లి గ్రామంలోని శ్రీ రామ లింగేశ్వరస్వామి జాతరలో భాగంగా శనివారం నిర్వహించిన రథోత్సవంలో మానకొండూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు, ధర్మకర్తలు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందజేశారు. రథోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ పండుగ సునీత, మాజీ ఎంపీపీ గుడిసె అయిలయ్య, పార్టీ నాయకులు పసుల వెంకటి, ఒగ్గు రమేశ్, మంజుల––రమేశ్, రాజు, బాల్ రెడ్డి, రవీందర్ రెడ్డి, రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# జమ్మికుంట ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ గా రమేష్

**వేద న్యూస్, జమ్మికుంట:**



జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ బి. రమేష్ శనివారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా జమ్మికుంట పట్టణ వాసులు, స్థానికులు, రోగులు, ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైద్య రంగంలో అనుభవం కలిగిన డా. రమేష్ బాధ్యతలు చేపట్టడంతో ఆసుపత్రిలో వైద్య సేవలు మరింత మెరుగుపడతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకించి పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా డా. రమేష్ పనిచేస్తారని ఆశిస్తున్నారు. ఆసుపత్రిలో సిబ్బంది సమన్వయం, రోగులకు మెరుగైన సేవలు, పరిశుభ్రత, ఔషధాల లభ్యతపై ప్రత్యేక దృష్టి సారిస్తారని తెలుస్తోంది. డా. రమేష్ నియామకంతో జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రి మరింత అభివృద్ధి చెందడంతో పాటు, పరిసర గ్రామాల ప్రజలకు కూడా మెరుగైన వైద్య సేవలు అందనున్నాయనే నమ్మకం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది డా. రమేష్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ.., ఆయన నాయకత్వంలో ఆసుపత్రి మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తానని ఈ సందర్భంగా నూతన సుపరింటెండెంట్ డాక్టర్ బి. రమేష్ వెల్లడించారు.

# ప్రజా పాలనకు ప్రతీక గృహజ్యోతి

– లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి గ్రీటింగ్స్

**వేద న్యూస్, ముస్తాబాద్ :**




రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలో గృహజ్యోతి పథకం లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి వచ్చిన గ్రీటింగ్స్‌ను పోతుగల్ సర్పంచ్ పెద్దిగారి యాదమ్మ అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు, విద్యుత్ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ పెద్దిగారి యాదమ్మ మాట్లాడుతూ.. పోతుగల్ గ్రామంలో గృహజ్యోతి పథకం కింద రైతుల పంపుసెట్లకు సుమారు 1,200, ఇండ్లకు 800 చొప్పున మొత్తం 2,000 కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని తెలిపారు. గృహజ్యోతి పథకం ప్రజా పాలనకు ప్రతీకగా నిలుస్తోందని, పేద, మధ్యతరగతి కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించే ఈ బృహత్తర పథకాన్ని అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ పథకాన్ని ప్రవేశపెట్టిన సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డిలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ రంగాన్ని బలోపేతం చేసి లబ్ధిదారులకు, రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గృహజ్యోతి పథకం కింద లబ్ధిదారుల తరపున రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు రూ.3,593 కోట్లు చెల్లించిందని పేర్కొన్నారు. రైతులకు నిరంతర విద్యుత్ సరఫరాకు భరోసా కల్పిస్తూ వ్యవసాయదారులకు నూతన విద్యుత్ కనెక్షన్లను 2024లో 97,893, 2025లో 1,00,267 కనెక్షన్లు ఇచ్చినట్లు గుర్తు చేశారు. గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్తు ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ పరిధిలో ప్రతి నెల 52 లక్షల కుటుంబాలకు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ సెల్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్, విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ జగదీష్, లైన్మెన్ శ్రీనివాస్, కారంగుల వెంకట్ రావు, అనిత, లాస్య, కంచం నరసింహులు, లబ్ధిదారులు, గ్రామ ప్రజలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మురికి కాలువలు శుభ్రం చేయరూ..

**– దుర్వాసనతో వీర్నపల్లి మండల ప్రజల ఇబ్బందులు**



**వేద న్యూస్, వీర్నపల్లి :**

రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో మురికి కాలువలు శుభ్రం చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలువల్లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, మట్టి పేరుకుపోవడంతో మురుగు నీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. మురుగు నీరు రహదారులపైకి చేరడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. అలాగే మురికి నీటి నిల్వల కారణంగా దోమల పెరుగుదల అధికమై, డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు సరైన చర్యలు తీసుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురికి కాలువలను తక్షణమే శుభ్రం చేసి, శాశ్వత పరిష్కారం చేపట్టాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఉత్సాహంగా సీఎం కప్ క్రీడాజ్యోతి ర్యాలీ

**వేద న్యూస్, టేక్మాల్ :**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం కప్ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ క్రీడలను ప్రోత్సహించే ఉద్దేశంతో శనివారం క్రీడాజ్యోతి ర్యాలీని మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని చౌరస్తా నుంచి జిల్లా పరిషత్ మైదానం వరకు భారీ ఎత్తున ఈ టార్చ్ ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ తులసీరామ్, ఎంపీడీవో రియాజుద్దీన్, ఎంఈఓ సుజాత, మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్ శంకరయ్య, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నిమ్మ రమేష్, టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల వీరప్ప, మెదక్ జిల్లా మైనారిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ మజార్, మాజీ సర్పంచ్ ఆకులపల్లి పాపయ్య, టీఆర్ఎస్ నాయకుడు నాయకోటి భాస్కర్, సర్పంచులు సక్రు నాయక్, రంగలాల్, టౌన్ ప్రెసిడెంట్ బత్తుల కిషోర్, జోగిపేట్ మార్కెట్ కమిటీ సభ్యుడు రాజేష్ గౌడ్, సంగమేష్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి మహేష్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ నాయకోటి సుభాష్, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు భోగం వీరేశం, సాయి శేషు గౌడ్, వెంకటేశం, సల్ల అనిల్, ఇరుణాల సాయిబాబా తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, యువకులు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు. సీఎం కప్ ద్వారా గ్రామీణ స్థాయిలో క్రీడా ప్రతిభను వెలికి తీసి యువతను క్రీడల వైపు ప్రోత్సహించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

# అభివృద్ధి పనులకు స్థలాలు పరిశీలన

**– అధికారులతో చర్చించిన ఇంచార్జి కలెక్టర్**

**వేద న్యూస్, చందుర్తి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి, చందుర్తిలో వేర్‌హౌస్ గోదాం ఏర్పాటుకు, మర్రిపల్లి గ్రామంలో రైతు విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి, వేములవాడ అర్బన్ మండలం నాంపల్లి వద్ద బీసీ భవన్ నిర్మాణానికి ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ రెవెన్యూ అధికారులతో కలిసి స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రతిపాదిత స్థలాలకు సంబంధించిన నక్షాలను పరిశీలించి, అధికారులతో పలు అంశాలపై చర్చించారు. అభివృద్ధి పనులు త్వరితగతిన ప్రారంభించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్లు భూపతి, అబూబాకర్ తదితరులు పాల్గొన్నారు.

# వీర్నపల్లి మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షలకు ఆహ్వానం

**వేద న్యూస్, వీర్నపల్లి:**




రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో 2026-27 విద్యా సంవత్సరానికి గాను 6, 7, 8, 9, 10వ తరగతుల్లో ప్రవేశాల కోసం నిర్వహించ నున్న ప్రవేశ పరీక్షలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠ శాల ప్రిన్సిపల్ డా. కె. అశోక్ తెలిపారు. ప్రవేశ పరీక్ష ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే మోడల్ స్కూల్ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు 6వ తరగతి ప్రవేశ పరీక్షకు అర్హులని, నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ప్రవేశ పరీక్ష తేదీ 19 ఏప్రిల్ 2026 కాగా, పరీక్ష కేంద్రం తదితర పూర్తి వివరాల కోసం సమీప పాఠశాలను సంప్రదించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

# రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం

**వేద న్యూస్, శాయంపేట:**



రహదారి ప్రమాదాలను తగ్గించి ప్రజల్లో రోడ్డు భద్రతపై చైతన్యం కల్పించాలనే లక్ష్యంతో అరైవ్-అలైవ్ కార్యక్రమంలో భాగంగా శాయంపేట మండలంలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ రంజిత్ రావు, ఎస్సై జక్కుల పరమేష్ పాల్గొని శాయంపేట గ్రామంలోని గర్ల్స్ వెల్ఫేర్ పాఠశాలలో డ్రాయింగ్, ఎస్సే రైటింగ్ పోటీలను నిర్వహించారు. అలాగే కాట్రపల్లి గ్రామంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, గ్రామ ప్రజలకు రోడ్డు భద్రత యొక్క ప్రాముఖ్యతను వివరించి, ట్రాఫిక్ నియమాలు పాటించాల్సిన అవసరాన్ని తెలియజేశారు. వివిధ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**– వరంగల్ డీసీసీ అధ్యక్షుడు అయూబ్**



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

వరంగల్ నగరంలోని 41వ డివిజన్ పరిధిలో ఇందిరమ్మ పథకం లబ్ధిదారు శైదాది బేగం నివాసాన్ని వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎండీ అయూబ్ సందర్శించి ముగ్గు పోసి శుభారంభం చేశారు. ఈ సందర్భంగా అయూబ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని పాలన సాగిస్తోందని తెలిపారు. హౌసింగ్ మినిస్టర్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కృషితో ఇందిరమ్మ వంటి గృహ నిర్మాణ పథకాలు వేగంగా అమలవుతున్నాయని పేర్కొన్నారు. పేదల పక్షపాతి మంత్రి కొండా సురేఖ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి అందే విధంగా నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజల జీవితాల్లో భద్రత, గౌరవం, అభివృద్ధి తీసుకురావడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు.

# సేవే మార్గంగా ముందుకొస్తున్నా..

**– 23 వ వార్డు కౌన్సిలర్ బరిలో కండెం వంశీకృష్ణ..**

**– ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించండి..అభివృద్ధి చేసి చూపిస్తా : జర్నలిస్టు వంశీకృష్ణ**

**వేద న్యూస్, జమ్మికుంట:**



రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో జమ్మికుంట పట్టణంలోని 23వ వార్డు నుండి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటున్నానని, వార్డు ప్రజలు ఆశీర్వదించి అవకాశం కల్పిస్తే వార్డు రూపురేఖలు మార్చి అభివృద్ధి చేస్తానని వైశ్య బిడ్డ, జర్నలిస్టు కండెం వంశీ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా కుల మతాలకు అతీతంగా పార్టీలకు అతీతంగా స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి ప్రజల ఆశీర్వాదంతో గెలిస్తే నిస్వార్థంగా సేవ చేస్తూ నాయకుడిగా కాకుండా సేవకుడి గా పని చేస్తానని వంశీ తెలిపారు. ఒక జర్నలిస్టుగా ప్రజా సమస్యలపై అవగాహన ఉందని 23వ వార్డు ప్రజలు ఆశీర్వదిస్తే తప్పకుండా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. రిజర్వేషన్ అనుకూలిస్తే బరిలో ఉంటానని ప్రజలు ఆశీర్వదించి ఆదరించాలని ఆయన కోరారు. పైసలకు ప్రలోభాలకు లొంగకుండా నాయకుడిగా సేవకుడిగా ప్రజలకు అందుబాటులో ఉంటానని ప్రజాసేవ చేయడంలోనే పూర్తి సమయం కేటాయిస్తానని ఈ సందర్భంగా తెలిపారు. ప్రజలకు అన్ని రకాల సేవలు , ముఖ్యంగా సుపరిపాలనే ధ్యేయంగా తాను పనిచేస్తానని వంశీ పేర్కొన్నారు.

# శివరాత్రిలోగా అన్ని పనులు పూర్తి చేయాలి

**– వీటీఏడీఏ పనుల్లో వేగం పెంచాలి**

**– నాంపల్లి గుట్టపై త్వరలో ఎయిర్ ఫోర్స్ విమానం**

**– ఇంచార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్**



**వేద న్యూస్, వేములవాడ :**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో కోరుట్ల బస్టాండ్ నుంచి చెక్కపల్లి చౌరస్తా మార్గంలో వీటీఏడీఏ నిధులతో ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను ఇంచార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు నిర్మాణంతో పాటు మురుగు కాలువల నిర్మాణాన్ని కూడా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రణాళిక ప్రకారం శివరాత్రి జాతరలోగా అన్ని పనులు పూర్తి చేయాలని, నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ యుద్ధప్రాతిపదికన పనులు పూర్తయ్యేలా నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. వేములవాడ ప్రధాన రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పెంచాలన్నారు. వేములవాడ మూలవాగు బ్రిడ్జి నుంచి రాజన్న ఆలయం వరకు జరుగుతున్న ప్రధాన రోడ్డు విస్తరణ పనులను ఇంచార్జి కలెక్టర్ పరిశీలించారు. రోడ్డు వెంట కాలినడకన వెళ్లి పనుల పురోగతిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రధాన రోడ్డు విస్తరణ పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విస్తరణతో పాటు అభివృద్ధి పనులపై ప్రతి రెండు రోజులకు ఒకసారి సమీక్ష సమావేశం నిర్వహిస్తామని స్పష్టం చేశారు. శివరాత్రి లోగా మెజారిటీ పనులు పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. గుడి చెరువు బండ్ పార్క్‌ను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలి. వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ గుడి చెరువును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని ఇంచార్జి కలెక్టర్ ఆదేశించారు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో గుడి చెరువు వద్ద చేపడుతున్న పనులను పరిశీలించారు. చెరువు ప్రవేశ ద్వారం నుంచి చివరి వరకు ఏర్పాటు చేసిన విగ్రహాలు, విద్యుత్ దీపాలు, మొక్కలు, ఫౌంటెన్‌లను కాలినడకన తిరిగి క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి పనికి సంబంధించిన మ్యాప్‌లను పరిశీలించి, క్షేత్రస్థాయిలో జరిగిన పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు. తుది దశ పనులను వేగంగా పూర్తి చేసి పట్టణ ప్రజలు, భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

నాంపల్లి గుట్టపై ఇండియన్ ఎయిర్ ఫోర్స్ విమానం ఏర్పాటు

వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి గుట్టపై త్వరలో ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌కు చెందిన విమానాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. నాంపల్లి గుట్టపై ప్రసాదం కౌంటర్ సమీపంలో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. పనుల పురోగతిని పరిశీలించి జిల్లా నీటిపారుదల శాఖ అధికారి కిశోర్ కుమార్‌కు పలు సూచనలు చేశారు. భక్తులకు ఆహ్లాదం కలిగేలా పరిసరాలను అభివృద్ధి చేయడంతో పాటు ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌కు చెందిన విమానం, ఇతర పరికరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, ర్యాంప్ ఏర్పాటు చేసి ప్రాంతాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, పబ్లిక్ హెల్త్ డీఈ వరుణ్, తహసీల్దార్ విజయ ప్రకాశ్ రావు, టీపీఓ అన్సార్, ఆర్అండ్‌బీ ఈఈ నరసింహాచారి, డీఈ శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఏడుపాయల జాతరకు పటిష్ట బందోబస్తు

**– చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం**

**– సిబ్బందికి కీలక సూచనలు చేసిన జిల్లా అదనపు ఎస్పీ మహేందర్**



**వేద న్యూస్, మెదక్ :**

మాఘ అమావాస్య సందర్భంగా ఏడుపాయల వనదుర్గమ్మ వద్ద స్నానాలు ఆచరించే భక్తుల భద్రత కోసం మెదక్ జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ తెలిపారు. జాతర బందోబస్తు ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించి, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని భద్రతా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. మాఘ అమావాస్య విధుల నిర్వహణపై నిర్వహించిన బ్రీఫింగ్‌లో భాగంగా అదనపు ఎస్పీ సిబ్బందికి కీలక సూచనలు చేశారు. విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, భక్తుల రద్దీని క్రమబద్ధంగా నియంత్రించాలని, క్యూ లైన్లు మరియు బారికేడ్ల వద్ద ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జాతర నిర్వహణను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాలు, ప్రధాన రహదారులపై సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర నిఘా కొనసాగిస్తున్నామని చెప్పారు. భక్తులు పోలీసు సిబ్బంది సూచనలు తప్పనిసరిగా పాటించాలని, వాహనాలను కేటాయించిన పార్కింగ్ స్థలాల్లోనే నిలిపి సహకరించాలని కోరారు. మహిళల భద్రత కోసం షీటీమ్స్, మహిళా పోలీసు సిబ్బంది, మఫ్టీ బృందాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళల పట్ల అసభ్య ప్రవర్తన, దొంగతనాలు, గొడవలు వంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాతర బందోబస్తును మూడు సెక్టార్లుగా విభజించి, జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో సుమారు 250 మంది అధికారులు, సిబ్బందితో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులు అధికారులు సూచించిన ప్రదేశాల్లోనే స్నానాలు చేయాలని, లోతట్టు లేదా ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు. జాతర సందర్భంగా ఏవైనా ఇబ్బందులు ఎదురైతే డయల్ 100 లేదా సమీప పోలీసు సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. భక్తులు పోలీసు సూచనలు పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో అమ్మవారి దర్శనం పూర్తి చేసుకొని సురక్షితంగా తిరిగి వెళ్లాలని జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఘర్షణలకు పాల్పడితే సహించేది లేదు

- ప్రశాంత వాతావరణంతో ముందుకెళ్లాలి
- కారేపల్లి ఎస్సై బైరు గోపి హెచ్చరిక
- ఇరు వర్గాలకు చెందిన 20 మంది బైండోవర్
- 14 మందిపై కేసులు నమోదు

**వేద న్యూస్, కారేపల్లి:**

ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల అనంతరం గ్రామంలో ఘర్షణ వాతావరణం నెలకొంటున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై కారేపల్లి పోలీసులు చర్యలు చేపట్టారు. కారేపల్లి మండల పరిధిలోని పోలంపల్లి గ్రామపంచాయతీలో స్థానిక ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేక గెలిచిన సర్పంచ్ మద్దతుదారులపై ప్రత్యర్థి వర్గం, వారి అనుచరులు దాడులకు పాల్పడ్డారని ఇరు వర్గాల నుంచి ఫిర్యాదులు అందినట్లు కారేపల్లి ఎస్సై బైరు గోపి తెలిపారు. ఈ ఫిర్యాదులను పరిశీలించిన అనంతరం ఘర్షణలకు పాల్పడిన వారిపై 14 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు. అలాగే శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ఇరు వర్గాలకు చెందిన సుమారు 20 మందిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై బైరు గోపి మాట్లాడుతూ.. గ్రామంలో శాంతి యుత వాతావరణాన్ని కాపాడట మే పోలీసుల ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ఘర్షణలు, దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బైం డోవర్‌కు లోబడి ఉన్న వ్యక్తులు మళ్లీ ఘర్షణలకు పాల్పడితే రెండు లక్షల రూపాయల జరిమానా లేదా ఏడాది జైలు శిక్ష విధించే అవకాశం ఉందని తెలిపారు. గ్రామంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్సై కోరారు.




# నూతన సర్పంచ్‌లకు సన్మానం

**వేద న్యూస్, కారేపల్లి :**



సంక్రాంతి సందర్భంగా కారేపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో స్థానిక సర్పంచ్ మెదరి వీరప్రతాప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ కు వివిధ గ్రామాల సర్పంచులు శనివారం హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి గిరిజన నాయకుడు అజ్మీరా వీరన్న ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సర్పంచులను అజ్మీరా వీరన్న శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నూతన సర్పంచులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సేవాభావంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు పేదల వరకు చేరేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కారేపల్లి సర్పంచ్ మెదరి వీరప్రతాప్, భాగ్యనగర్ తండ సర్పంచ్ బాణోత్ హిరాలాల్, చిన్నమడెంపల్లి సర్పంచ్ బానోత్ పద్మా రూప్ల నాయక్, పాత కమలాపురం సర్పంచ్ తేజవత్ బాబురావు, మాజీ ఉపసర్పంచ్ గౌస్, చంద్ర నాయక్, గంగరబోయిన మురళీ, క్రికెట్ కెప్టెన్లు తెలకలపల్లి శ్రీను, గుగులోత్ రాంబాబు, నాగి తదితరులు పాల్గొన్నారు.

# 22 వవార్డు కౌన్సిలర్ బరిలో విద్యావంతురాలు

- ఆశీర్వదించండి: అభిలాష

**వేద న్యూస్, జమ్మికుంట :**

రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో జమ్మికుంట పట్టణంలోని 22వ వార్డు నుండి కౌన్సిలర్ అభ్యర్థిగా బరిలో ఉంటున్నానని, వార్డు ప్రజలు ఆశీర్వదించి ఒక విద్యావంతురాలు నైన తనకు అవకాశం కల్పిస్తే జమ్మికుంట పట్టణంలోనే ఆదర్శవంతమైన వార్డుగా చేసి చూపిస్తనని జి.అభిలాష తెలిపారు. 22 వార్డులో వర్షాకాలం వస్తే వార్డులో ఎదురయే సమస్యలకు పూర్తి శాశ్వత పరిస్కారాన్ని చేసి చూపిస్త నని, మరియు గత కొన్ని సంవత్సరాలుగా నిర్మాణం జరగకుండా వున్నా మన అంబెడ్కర్ భవనాన్ని పూర్తి చేస్తా , సిటీకేబుల్ లైన్ మరియు నాయిని చెరువుకు పోయే కూడలిలో సెంట్రల్ లైటింగ్ తో కూడిన సర్కిల్ లను ఏర్పాటు చేస్తానని వార్డులో డ్రైనేజ్ సమస్యలు మరియు పారిశుధ్య సమస్యలను పరిష్కరిస్తానని ఒక ప్రకటనలో తెలిపారు . కుల మతాలకు అతీతంగా ప్రజా సేవే లక్ష్యంగా బరిలో నిలిచి వార్డు ప్రజల ఆశీర్వాదంతో గెలిపి స్తే.. మీ ఇంటి బిడ్డగా ప్రతి అవ్వకు ఒక బిడ్డగా అన్నలకు చెల్లెగా తమ్ముళ్లకు ఒక అక్కగా ఒక నాయకురాలిగా కాకుండా ఒక సేవకురాలిగా మీ అందరి చేతులలో మీ కళ్ళముందు పెరిగిన బిడ్డగా పని చేస్తానని తన వార్డు ప్రజల పూర్తి ఆశీర్వాదంతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేసారు .



# ఎమ్మెల్యేకు సంక్రాంతి శుభాకాంక్షలు

**వేద న్యూస్, కారేపల్లి:**



మకర సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సింగరేణి మండల కాంగ్రెస్ నాయకులు శనివారం కొత్తగూడెంలోని ఎమ్మెల్యే నివాసంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి, మండలంలోని ప్రజా సమస్యలపై ఎమ్మెల్యేతో నాయకులు చర్చించారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకుడు అడ్డగోడ ఐలయ్య, బీసీ సెల్ నాయకుడు బోళ్ల రమేష్, బండారి మోహన్ రావు, చీమలపాడు సర్పంచ్ లలిత బాబు సింగ్, నాన్య తండా సర్పంచ్, పేరెపల్లి సర్పంచ్ లలితా బద్రి నాయక్, కందుల శ్రీనివాసరావుతో పాటు పార్టీ సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత పాటించాలి

- రోడ్డు ప్రమాదాలు తగ్గించడమే అరైవ్-అలైవ్ లక్ష్యం - ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**



ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో రోడ్డు భద్రతపై అవగాహన పెంచి ప్రమాదాలను తగ్గించడమే అరైవ్-అలైవ్ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్ తెలిపారు. శనివారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో వుమెన్ అండ్ ఫ్యామిలీ సేఫ్టీ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అనిల్ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనం నడపడం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి చర్యల వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్, భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీల మధ్య చిచ్చు పెడుతున్నారు

- అమాయక గిరిజనులను పావులుగా వాడుకుంటున్నారు
- అక్రమ కేసులు ఎత్తివేయాలి
- ఆదివాసీ పోరాట హక్కుల సమితి

**వేద న్యూస్, కారేపల్లి:**

రాజకీయ లబ్ధి కోసం ఆదివాసీల మధ్య చిచ్చు పెడుతున్నారని ఆదివాసీ పోరాట హక్కుల సమితి (తుడుందెబ్బ) జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యుడు కల్తి రాంప్రసాద్, జిల్లా నాయకుడు పూనెం శివరామ్ ఆరోపించారు. శనివారం కారేపల్లి మండలం పోలంపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో ఓటమి పొందిన పూనెం హిమబిందు పోలీసులను ఆశ్రయించగా, వారికి మద్దతుగా పోలంపల్లి నాగయ్యగుంపుకు చెందిన గిరిజనులు, తుడుందెబ్బ నాయకులు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా కొమరం భీమ్ సెంటర్‌లో తుడుందెబ్బ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. పోలంపల్లి సర్పంచ్ హేమలత ఆమె భర్తతో పాటు మరికొందరు అమాయక ఆదివాసీ గిరిజనులను పోలీసు కేసులతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అమాయక గిరిజనులను పావులుగా వాడుకుంటూ ఆదివాసీల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారని ఆరోపిస్తూ, ఇటువంటి చర్యలను సహించేది లేదని స్పష్టం చేశారు. పోలీసులు, అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి అక్రమ కేసులను వెంటనే ఎత్తివేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆదివాసీ జేఏసీ చైర్మన్ పెండెకట్ల యాకయ్య దొర, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు తాటి రామారావు, ఆదివాసీ జేఏసీ జిల్లా జనరల్ సెక్రటరీ వట్టం నాగేశ్వరరావు, జిల్లా నాయకులు ఈసాల రాంబాబు, ఎట్టి సత్యనారాయణ, జబ్బ శివరాం, కొర్స సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.




# కొండమ్మ కుటుంబానికి ఆర్థిక సహాయం

**వేద న్యూస్, కారేపల్లి:**





వైరా నియోజకవర్గం, సింగరేణి మండలం దుబ్బాతండా గ్రామానికి చెందిన బాణోత్ కొండమ్మ శనివారం తెల్లవారుజామున 3:30 గంటలకు మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎల్ఐసీ రమేష్ మృతురాలి నివాసానికి చేరుకుని కొండమ్మ మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబానికి మనోధైర్యం కల్పిస్తూ ఆర్థిక సహాయంగా రూ.3,000 నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో భూక్యా కుమార్, నందు, రాందాస్, లావుడ్యా రామా, వీరేందర్, గూగులోతు కుమార్, భూక్యా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని దానాల కన్న రక్తదానం గొప్పది

**వేద న్యూస్, ఆదిలాబాద్ ప్రతినిధి :**

ఆదిలాబాద్ ఇచ్చోడ మండల కేంద్రంలోని స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాలలోకీ.శే. సురుకుంటి శ్రీధర్ రెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించిన రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా బోథ్ ఎమ్మెల్యేఅనిల్ జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా యువకులకు ఆదర్శంగా మొదటగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ రక్తదానం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ..గిరిజన ప్రాంతాల్లో రక్తదానాల శాతం తక్కువగా ఉంటుందనిదానిని పెంచడానికే మొదటగా ముందుకు వచ్చి వారిలోఅవగాహన కల్పించాడానికే రక్తదానం చేయడం జరిగిందన్నారు. స్వచ్ఛందంగా రక్తదానం చేసిన యువతి యువకులకు అభినందించారు. కీ.శే. సురుకుంటి శ్రీధర్ రెడ్డి గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్న సంకల్పంతో ఇచ్చోడ మండల కేంద్రంలోనే మొట్ట మొదటగా వివేకానంద విద్యా సంస్థలను ఏర్పాటు చేశారన్నారు. ఆయనసేవలకు ఎందరో విద్యార్థులు ఉన్నతమైన స్థాయిలకు చేరారని అన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ నారాయణ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ నికినీ వర్మ, అధ్యాపక బృందం మరియు మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# హాట్ ఎయిర్ బెలూన్ ఎమర్జెన్సీ ల్యాండింగ్..

**వేద న్యూస్ హైదరాబాద్ :**



హైదరాబాద్‌లో జరుగుతున్న హాట్ ఎయిర్ బెలూన్ ఈవెంట్‌లో పెను ప్రమాదం తృటిలో తప్పింది. సంక్రాంతి సందర్భంగా సెలబ్రేట్ ద స్కై పేరుతో హాట్ ఎయిర్ బెలూన్ల ఈవెంట్‌ను రాష్ట్ర పర్యాటక శాఖ నిర్వహిస్తున్నది. శుక్రవారం ఈ కార్యక్రమం ప్రారంభమైంది. అయితే ఇవాళ ఓ హాట్ ఎయిర్ బెలూన్.. ఎమర్జెన్సీ ల్యాండింగ్ అయ్యింది. బెలూన్‌లో గాలి అకస్మాత్తుగా తగ్గిపోవడంతో దాంట్లో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ఆ బెలూన్‌ను నెక్నమ్‌పూర్ లేక్‌లో ఎమర్జెన్సీగా దించేశారు. ల్యాండింగ్ సమయంలో ఆ బెలూన్‌లో ముగ్గురు వ్యక్తులు ఉన్నారు. ప్రస్తుతం ఆ బెలూన్‌ను నిర్వాహకులు తరలించారు.

# దళిత యువకుడి హత్యపై వైయస్ఆర్ సీపీ ఆగ్రహం

**వేద న్యూస్ అమరావతి :**

పల్నాడు జిల్లా పిన్నెల్లిలో దళిత యువకుడు మండా సాల్మన్‌ను పాశవికంగా హత్య చేసిన ఘటనను నిరసిస్తూ శనివారం శ్రీకాకుళం నగరంలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ పాలనలో దళితులకు రక్షణ లేకుండా పోయిందని మండిపడ్డారు. సాల్మన్ హత్య అత్యంత అమానుషమని పేర్కొంటూ, రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని తీవ్ర విమర్శలు చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. బాధిత కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దళితులపై జరుగుతున్న దాడులను సహించబోమని స్పష్టం చేస్తూ, పార్టీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ అంశంపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.




Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073